కథ


# ఉభయకుశలోపరి

సిహెచ్.వి.వి.రత్నమాల

‘‘ఏమిటి సరళా... కూరంతా ఉప్పుకశం చేసేసావు?’’ అనడిగింది అత్తగారు. సరళ గుమ్మం దగ్గర ఇంకా చెప్పులు విప్పకుండానే.

‘‘ఏమో అత్తయ్యా. తొందరలో కొంచెం ఎక్కువయినట్టుంది. అయినా రోజూ ఒకేలా వంటెలా కుదురుతుందత్తయ్యా. ఎవరికైనా అప్పుడప్పుడు కొంచెం తేడా వస్తుంది కదా!’ అంది నెమ్మదిగా.

‘‘ఏమో తల్లీ! ఈ తొందరవంటలు నాకు చాతకావు. తెల్లారగట్టే లేచి వండాల్సిందే! ఎంత పదును అనుకున్నావు. మెతుక్కి మెతుక్కి అంటితే కంచం తోసేసేవారు మీ మామయ్య. నాలుగయిదు రకాలు, పప్పు, పులుసు, పచ్చడి కూర అన్నీ యధావిధిగా చెయ్యాల్సిందే. ఇప్పటిరోజుల్లా బద్ధకిస్తే ముద్దముట్టే వారు కాదు. ఆ ఓపిక ఎక్కడికి పోయిందో. ఆ కాలమే వేరు. కట్టెలపొయ్యి మీద వంట. గ్యాస్ పొయ్యిలమీద కుక్కర్‌లో వంటక్కూడా మీరు హైరానా పడి పోతుంటారు. ఒక్క ఘడీ ముందు లేవచ్చు గదమ్మాయి’’ అంది సాగతీస్తూ అత్తగారు.



అసలే ఆఫీసు పనుల టెన్షన్‌లో ఉన్న సరళకి కొంచెం కోపం వచ్చినా తమాయించుకుని ‘‘ఈ బస్సులవీ ఎక్కి దిగి తిరిగి తిరిగి అలసిపోయి వస్తాం కదా అత్తయ్యా, మధ్యాహ్నామూ నిద్రపోడానికి ఉండదు కదా. అందుకే పొద్దున్నే తొందరగా మెలకువరాదు’’ అంది సరళ.

‘‘సర్లే ఒక్కతివే ఉద్యోగం చేస్తున్నట్టు చెబుతావు. తాయారమ్మ కోడలికి పని మనిషే లేదుట. ఆమె ఉద్యోగం చేయట్లా!’’ అంటూ వాదించబోయింది.

సరళ అలసిపోయి ఉందేమో కొంచెం విసుగ్గానే.

‘‘వాళ్ళాయన సాయం చేస్తారు కాబట్టి వాళ్ళేదో కలిసి చేసుకుంటారు. అందరినీ ఒకేలా పోలిస్తే ఎట్లా? మీ అబ్బాయికి టైంఉండదు. పొద్దుట పోయి రాత్రెప్పుడో వస్తారు. అయినా ఎవరి ఓపిక వాళ్ళది. ఎవరి ఇంటి తీరు వాళ్ళది. సర్లెండి కానీ పిల్లలు ట్యూషన్‌కి వెళ్ళారా!’’ అనడిగింది సరళ.

‘‘వెళ్ళారు కాబట్టే తల్లీ ఇంత ప్రశాంతంగా ఉంది. ఉన్నంతసేపూ ఆ వెధవ కార్టూనే పెడతారు. ఒక్క సినిమా చూడనివ్వరు. సీరియలు చూడనివ్వరు’’ అంది నిష్ఠూరంగా అత్తగారు.

‘‘పోనీలెండి అత్తయ్యా. చిన్నపిల్లలు. కాసేపు చూసి ట్యూషన్‌కి వెళ్ళిపోతారు కదా! వచ్చి అన్నంతిని నిద్రపోతారు. ఆ కాసేపేగా వాళ్ళు చూసేది. తర్వాత నేనెలాగూ టీ.వి. చూడను. మీకు కావలసినవి పెట్టుకుని చూడండి’’ అంది పిల్లల్ని సమర్థిస్తూ సరళ.

‘‘ఏమోనమ్మా! ఆ టయింకి ‘గంగోత్రి’ చూడకపోతే నాకసలు తోచదు. అదే టయింకి వస్తారు వీళ్ళూనూ. అక్కడుంటే అన్నపూర్ణమ్మగారు నేను కూచుని చూసే వాళ్ళం’’ అంది అత్తగారు.

ఇంక వాదన పొడిగించడం ఇష్టం లేక మౌనంగా ఊరుకుంది సరళ.

‘‘అక్కడ టీ పెట్టి వచ్చాను. మీ మామయ్యగారికి కాస్త ఇచ్చి, నువ్వు కూడా వెచ్చబెట్టుకుని తాగు’’ అంది అత్తగారు.

అలా వెచ్చబెట్టిన టీ సరళకు నచ్చదు. బలవంతంగా

తాగాలి. అంతకీ అప్పుడప్పుడు చెబుతుంది.

'నేనొచ్చి పెట్టుకుంటానత్తయ్యా. మీరు మావయ్యగారు తాగడానికి సరిపడా పెట్టండి' అని.

''రాత్రికి ఏం వండమంటారు? వంకాయలు, దొండకాయలు, బెండకాయలు ఉన్నాయి'' అనడిగింది సరళ.

''ఏదో ఒకటిచెయ్యి. పొద్దునెలాగూ ఆదరాబాదరా. ఇప్పుడయినా కమ్మగా చెయ్యి. జిహ్వ చచ్చిపోతోంది'' అంది అత్తగారు.

''వంకాయ కొత్తిమీర కారం పెట్టి వండమంటారా, పిల్లలకి కూడా ఇష్టమేనూ'' అంది సరళ.

''కాస్త ఉప్పుకారం సరిపడా వేయి. లేకపోతే బావుండదు'' అంది.

''పిల్లలు కారం ఎక్కువయితే తినరత్తయ్యా. అయినా ఎవరికీ ఉప్పు, కారాలు అంత మంచివి కావు. అందులోను మీకు బీపీ, మావయ్యగారికి షుగరు'' అంది సరళ.

''ఆ! ఛస్తే ఛస్తాం. ఎన్నాళ్ళిలా నోరు కట్టుకోవాలి. ఆ డాక్టర్లలాగే చెబుతారు'' అంది.

నిజానికి సరళ అత్తగారు స్వతహాగా చాలామంచిది. సరళను పైసా కట్నం లేకుండా చేసుకుంది.

ఉద్యోగం చేసే అమ్మాయి అని కోడలంటే గౌరవం ఏ విషయంలోనూ ఆంక్షలు పెట్టదు.

కోడల్ని ఎవరైనా ఒక్క మాటన్నా ఒప్పుకోదు.

అర్థం చేసుకునే మనిషే కానీ సర్దుకునే తత్వం తక్కువ.

ఆ మాటకొస్తే సరళ అత్తగారే కాదు. చాలామంది అంతేనేమో: పెద్దవాళ్ళయ్యాక కొంచెం ఛాదస్తం. వాళ్ళ మాటే పైనుండాలనే పట్టుదల ఎక్కువ ఉంటాయి.

సరళకి అత్తగారంటే చాలా గౌరవం.

మొదట్లో ఏమీలేని సంసారాన్ని ఇంతవరకు లాక్కొచ్చిందంటే అది అత్తగారు ఓర్పు, నేర్పువల్లనేనని భర్త ద్వారా తెలుసుకుంది సరళ.

సరళ భర్త రవి కూడా ఏమీ అనే మనిషి కాదు గానీ.


ఎప్పుడయినా మా అమ్మ ఇలాచేసేది. అలా చేసేది మీరెవరూ అలాగ చేయలేరు అంటే కొంచెం కోపం వచ్చేది సరళకి.

''మీ అమ్మగారు ఇంట్లో ఉండే మనిషి. అదీగాక ఆ రోజుల తిండికి బలంగా చేసే వారు. పోలిక చేసేప్పుడు నాలా ఉద్యోగం చేసే వాళ్ళతోటే ఈ కాలపు వాళ్ళతోటే చేయండి. అయినా ఒకరితో నాకు పోలికెందుకు'' అనేది.

''ఊరికే అన్నాను లేవోయ్. నిన్నేమన్నా అంటే ముందు మా అమ్మే నన్ను బతక నీయదు. ఏరికోరి తెచ్చుకున్న కోడలు కదా. ఏమైనా అంటే నా కోడలుకు వంక పెట్టే పనే లేదు అంటుంది'' అని సర్దిచెప్పేవాడు రవి.

ఓ రోజు ఏదో చెప్తుంటే మధ్యలో ఆపి

''ఆ! ఈ మాటలకేం గానీ పిల్లలకీ, అత్తయ్యగారికి మధ్యన నేను ఛస్తున్నా. ఆ టీవీ చూడడానికి ఇద్దరికీ గొడవే. చింటుగాడు బామ్మెప్పుడు వెళ్ళిపోతుందే! అని అడుగుతున్నాడు. ఎవరో చెప్పినట్టు మాట్లాడతాడు. నోర్మూయమన్నాను. ఆవిడకీ వీళ్ళంటే పంచప్రాణాలే. కానీ ఈ చిన్నచిన్న విషయాల్లో ఇద్దరికీ సర్దలేక పోతున్నా, అసలు ఆటకే వెళ్ళద్దు. ఏవో దెబ్బలు తగిలించుకు వస్తారు. లేదంటే అలసిపోయి చదవకుండా నిద్రపోతారంటారు అత్తయ్యగారు. వీళ్ళు ఊరుకుంటారా. పెట్టింది తినాలని అంటారు ఆవిడ. వీళ్ళకి అన్నీ నచ్చవు. కష్టపడి చేసామంటే, 'నాకు నచ్చనిది ఎంతకష్టపడి చేసినా నేను తిననంతే' అంటాడు చింటూగాడు. నేనే వీళ్ళని సరిగా పెంచలేదేమో అనిపిస్తోంది'' అని తన గోడంతా వెళ్ళబోసుకుంది సరళ.



''ఏం కాదులే పిచ్చీ. ఎక్కడయినా ఉండేవే ఇవన్నీ. అయినా మనం చెయ్యగలిగే చిన్నచిన్న సర్దుబాట్లు చేయలేకపోతే ఇవే చిలికిచిలికి పెద్దగొడవలై పెద్ద పెద్ద అంతరాలు ఏర్పడి, అమ్మా వాళ్ళు కూడా సర్దుకోలేక మనల్నే తప్పుగా అనుకొని, చివరికి వాళ్ళకి ఇద్దరూ స్వంత ఊళ్ళో ఉంటే స్వతంత్రంగా ఉండచ్చనే భావన ఏర్పడిపోతుంది'' అన్నాడు రవి.

''నిజంగా మీరు చెప్పింది కరెక్ట్. ఇప్పటికే అత్తయ్యగారు చాలాసార్లు అంటూ ఉంటారు. మేం వెళ్ళిపోతాం బాబూ! మేము వెళ్ళాక ఇహ మీ ఇష్టం. అక్కడ కొంపా, గోడూ అన్నీ వదిలి పెట్టుకుని వచ్చాం. ఎన్నాళ్ళని ఉంటాం. అమావాస్య వెళ్ళాక మంచిరోజు చూసి బయలుదేరతాం అన్నారు'' అంది సరళ.

''మరి నువ్వేమన్నావు'' అన్నాడు.

''ఏమంటాను? ఎందుకత్తయ్యగారు! అక్కడికెళ్ళి ఒక్కరూ ఏం చేస్తారు? ఏమైనా ఒంట్లో బాగా లేకపోతే ఎవరు చూస్తారు. పెద్దవాళ్ళయ్యారు. ఓపిక ఏం ఉంటుంది మీకు? ఎప్పుడైనా చేతకాకపోతే అక్కడ ఎవరు వండిపెడతారు. అయినా ఇంతవరకూ కష్టపడ్డారు. మీరు ఈ వయసులోనే కాస్త విశ్రాంతి తీసుకొనేది. అక్కడ ఒక్కరూ ఉండే ఖర్మ మీకేంటి? మిమ్మల్ని నేను సరిగా చూసుకోవడం లేదా?'' అంటూంటే.

అత్తయ్యగారు వెంటనే ''ఇప్పటినుంచీ మీ నెత్తిమీద కూర్చోడం ఎందుకు తల్లీ, ఇప్పటినుంచీ ఈ ముసలాళ్ళంటే విసుగు పుట్టేట్టు. అసలు చేసుకోలేనప్పుడు మీ దగ్గరకు రాక ఇంకెక్కడికి వెళతాం'' అంటారు.

మావయ్యగారిని అడిగితే అత్తయ్యగారికి వంత పాడతారు.

''ఎక్కడుంటే ఏమిటమ్మాయ్, మీరు వస్తుండండి. మేమూ వస్తూంటాం. అంటారు'' అంది.

''అమ్మా, నాన్నగారే కాదు సరళా, చాలామంది తల్లిదండ్రులంతా ఇలాగే అనుకుంటున్నారు. పూర్తిగా చేసుకోలేనప్పుడు ఎలాగూ రావాల్సిందే. అప్పటి దాకా ఇలా వచ్చి వెళుతూ వుంటేనే ఈ బాంధవ్యాలు ఇలా ఉంటాయనీ, పూర్తిగా వచ్చేస్తే కొడుకు, కోడలు సరిగా చూడకపోతే, మళ్ళీ తిరిగి వెళ్ళలేమనే భయం కూడా కొంతమందికి ఉంటుంది. అంటే అమ్మా నాన్నకి మన విషయంలో అలాంటి భయమేమీ ఉండదు కానీ విడిగా ఉంటే స్వతంత్రంగా ఉంటారు. పాత చుట్టాలంతా వాళ్ళ దగ్గరకు వచ్చినంత చనువుగా మన దగ్గరకు రాలేరని కూడా కావచ్చు. మనకీ ఇబ్బంది లేకుండా ఉండాలని కూడా కాబోలు'' అన్నాడు రవి.

''ఏమో! వాళ్ళ మనసులో ఏముందోకానీ, నాకు మాత్రం వాళ్ళు ఒక్కళ్ళూ అక్కడ ఉండడం ఇష్టం లేదు. ఈ వయసులో కాకపోతే వాళ్ళు ఇంకెప్పుడు సుఖపడతారు. ఏమైనా చిన్నచిన్న తేడాలొచ్చినా నేను సర్దుకుని పోతాను. నాకు తెలిసి నావల్ల ఆవిడకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. మహాఅయితే వంట దగ్గరే వస్తుంది. ఉప్పుకారాలు విడిగా వాళ్ళకి వెయ్యమ్చుకానీ మంచిది కాదని వెయ్యను. ఆలోచిస్తే అలవాటయిపోయాక ఒక్కసారే పూర్తిగా తగ్గించేస్తే తినలేరు పాపం. ఇంక టివి సంగతంటారా, వాళ్ళు ఇక్కడికి వచ్చేస్తే ఆ టీవీ ఎలాగూ ఉంటుంది కాబట్టి ఇష్టమయినప్పుడు ఏం కావాలంటే అది చూస్తూ ఉంటారు. పిల్లలకు కూడా తాత, బామ్మకి అభిమానంగా ఉండాలని నేను నచ్చ చెబుతాను. వాళ్ళని ఉండి పొమ్మని చెప్పండి'' అని బతిమాలింది సరళ.

''నేను వచ్చినప్పుడల్లా చెబుతూనే ఉన్నాను. వినడం

లేదు. అయినా నీలా ఇంత చక్కగా ఆడవాళ్ళంతా ఎందుకు ఆలోచించరు సరళా. ఎంతసేపూ తనే రాణీలా వెలిగిపోవాలని చూస్తారు తప్ప పెద్దవాళ్ళను సుఖపెట్టాలనే ఆలోచన ఎందుకు రాదు, ఈ విషయంలో అమ్మని కూడా మెచ్చుకోవాలి. ఏదైనా ఉంటే 'అదేమిటమ్మాయ్' అని అడిగేస్తుంది తప్ప కోపం పెట్టుకోవటం. ఇంటికి వచ్చాక చాడీలు చెప్పడం చేయదు.

చిన్నచిన్న పొరపాట్లు అందరమూ చేస్తాము. కానీ మీరిద్దరూ ఏదీ నాదాకా రానివ్వకుండా చక్కగా కలిసిపోతారు. నూటికి తొంభై ఇళ్ళలో ఇద్దరి మధ్య తేడాల వల్ల కొడుకులు నలిగిపోతుంటారు. ఇద్దరికీ సర్దిచెప్పలేక. రోజూ కలిసి జీవించాల్సింది భార్యతోనే కాబట్టి భార్య వైపే మొగ్గి, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తుంటారు. మన శ్శాంతిగా ఉండాలంటే ఆత్మవంచన తప్పదనుకుని తల్లి తండ్రులలోపాలు వెతికి అందుకే నా భార్య వాళ్ళతో సర్దుకుని ఉండలేక పోతోందని సర్దిచెప్పుకుంటారు. ఈ విషయంలో నేను చాలా అదృష్టవంతుడిని ఆఫ్‌కోర్స్. నేను ఇద్దరినీ బాగా మేనేజ్ చేయగలగలడం నా టాలెంట్ అనుకో. అయినా ఇంత మంచి భర్తను ఇచ్చిన అమ్మను, నాన్నగారిని నువ్వెలాగు బాగా చూసుకుంటావనుకో'' అన్నాడు సరదాగా నవ్వుతూ.

''ఆ! స్వోత్కర్ష చాలుగానీ. ముందు అత్తయ్యగారు వాళ్ళనీ ఒప్పించండి. అప్పుడు ఒప్పుకుంటాను నేను'' అంది సరళ కూడా నవ్వుతూ.

భార్య స్వచ్ఛమైన ప్రేమని చూసి చాలా ఆనందపడ్డాడు రవి.

నిజంగానే అత్తమామలంటే చాలా ఇష్టం సరళకి. వాళ్ళు ఊరు వెళ్ళిపోయాక వాళ్ళు కూర్చునే చోటు, తిరిగే ప్రదేశాలు చూసి కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంది. కొన్ని రోజుల వరకు మామూలుగా కాలేక పోతుంది.

అమ్మకూడా అక్కడికి వెళ్ళి రోజూ ఇక్కడి సరళ కబుర్లు, పిల్లల కబుర్లు చుట్టు పక్కల అందరికీ చెబుతూ ఉంటుంది.

ఇవన్నీ తలచుకొని అమ్మా, నాన్నలని ఇక్కడే ఉండిపోయేటట్లు ఒప్పించాలను కున్నాడు రవి.

అన్నం తిన్నాక అమ్మకొంగుకి చెయ్యి తుడుచుకోవడం అలవాటు రవికి.

అప్పుడు ఎంతో చిన్నపిల్లాడిలా అనిపిస్తాడు వాళ్ళమ్మకి.

''అమ్మా! నిన్నొకటి అడుగుతాను. కాదనవు కదా!'' అన్నాడు.

''నీకు చిన్నప్పటి నుంచీ ఇదే వెధవ అలవాటు. ముందర కాళ్ళకి బంధం వేసి అడిగితే నేను చెప్పను'' అంది వాళ్ళమ్మ.

''నువ్వు ఊరు వెళ్ళడం లేదు. ఇక్కడే ఉండిపోవాలి అంతే'' అన్నాడు రవి.

''నీ ఇష్టమేమిటి? ఎన్నాళ్ళున్నా, నీకూ. మీ ఆవిడకూ తృప్తి ఉండదు. రెన్నెళ్ళు అయింది. ఇంక మాట్లాడకు'' అంది.

''అది కాదమ్మా'' అన్నాడు.

''సర్లే, ఏది కాదు. మా కాళ్ళు, చేతులు ఆడినంత సేపూ మేము రాము. తర్వాత మీ దగ్గరే వద్దన్నానూ'' అంది.

''ఇదే రొటీన్ డైలాగ్. వినీవినీ బోరుకొడుతోందే అమ్మా, కాళ్ళూ చేతులు ఆడడం అంటే. నువ్వు మొండిదానవు కాబట్టి ఎన్ని నొప్పులున్నా చేసుకుంటావు. ఈ వయసులో కూడా ఎందుకమ్మా ఈ తిప్పలు నీకు'' అన్నాడు.

''నేనొకత్తినే చేస్తున్నానేమిటి? నా వయసు వాళ్ళు అందరూ చేసుకోవట్లా. సాగినన్నాళ్ళూ కానీ'' అంది గదమాయించి.

''నాన్నా! మీరైనా చెప్పండి. అమ్మకి'' అన్నాడు వేరే దారిలేక.

''మేం ముసలాళ్ళం. మా పద్ధతులూ, పడికట్లూ వేరే ఉంటాయిరా అబ్బాయి. నీకు అనుభవం లేదు. ఊరుకో'' అని నోరు మూయించారు.

మళ్ళీ ఆయనే, కొడుకు నొచ్చుకున్నాడేమోనని.

''చెప్పిన మాట వినరా. నువ్వు, కోడలు నెత్తిన పెట్టుకుని చూస్తున్నా, మాకు అలవాటయిన చోట ఉన్న సుఖం ఎక్కడా ఉండదురా. నీకు మమ్మల్నిక్కడేదో సుఖపెట్టాలని తాపత్రయంకానీ'' అని ససేమిరా ఒప్పుకోలేదు.

''ఇలా అందరమూ విడివిడిగా ఉండడం వల్లే. పిల్లలకి కూడా అభిమానాలు తెలీయకుండా పోతున్నాయమ్మా!'' అన్నాడు రవి.

''ఆ చిన్నసన్నాసులు, వాళ్ళకెందుకు తెలియదు. చనువు కాబట్టి మాతో పోట్లాడ తారు. వాళ్ళ తాతకి మందులు అవీ ఇస్తాడు. నాకు కళ్ళజోడు వెదికిస్తాడు చింటూగాడు. చిట్టి రాత్రిపూట కథలు చెప్పమని నా దగ్గరే వచ్చి పడుకుంటుంది. అభిమానం లేకపోవడమేమిట్రా!'' అంది.

''అదికాదమ్మా, ఇవన్నీ వాళ్ళు కోల్పోతారు కదా! మీరుంటే మీ దగ్గరే ఉంటారు. నా మాట విను'' అని బతిమాలాడు. ససేమిరా ఉండమని ఖరాఖండిగా చెప్పారిద్దరూనూ.

వాళ్ళ మాట కాదనలేక మంచిరోజు చూసి దింపి వచ్చాడు రవి.

వచ్చాక ఎంతో వెలితిగా అనిపించింది రవికి కూడా

నాన్నగారి మందులగూడు, అమ్మ, నాన్న పడుకునే మంచాలు ఖాళీగా ఉన్నాయి.

పిల్లలు కూడా ఏడ్చారు 'బామ్మని కార్టూన్ పెట్టమని విసిగించమే అమ్మా, రమ్మని చెప్పమ్మా!' అని

వెళ్ళేప్పుడు ఒకళ్ళని పట్టుకొని ఒకళ్ళు ఏడ్చారు

అత్తగారు అన్ని జాగ్రత్తలూ చెప్పింది తల్లిలాగా.

'అమ్మాయి. నీకు హడావిడి ఎక్కువ. నీళ్ళు పట్టాక మీ నేల మీద నీళ్ళు కనిపించవు. జారి పడతావు. తుడిచి పని చేసుకో' అని.

'చింటూ గాడికి వేపుళ్ళు పెట్టకు. చిట్టికి జడవేసి పంపించు క్లిప్పు పెట్టడం కాదు' అని గుర్తుకొచ్చినవన్నీ చెప్పింది.

పిల్లలని అల్లరి చేయొద్దని. అమ్మ మాట వినమని, ఇంట్లోనూ బయటా చేసుకోవాలి కాబట్టి విసిగించొద్దని చెప్పింది.

'మోకాళ్ళ నొప్పులకి కొనిచ్చిన మందు రాసుకుంటూ ఉండమ'ని.

'ఎప్పుడు ఓపిక లేకపోయినా ఫోన్ చేయండి. సెలవు పెట్టి వస్తాను' అని సరళ మరీమరీ చెప్పింది.

ఇవన్నీ తలచుకుంటుంటే రవికి ఈ బంధాలు ఎంత గొప్పవి అనిపించింది. ఎక్కడో చదివినట్లు.

'ప్రేమించగల హృదయమే దుఃఖించగలదు' అనుకున్నాడు.

అక్కడ ఊర్లో ముసలి వాళ్ళిద్దరికీ కూడా ఒంటరిగా అనిపించింది.

'కొన్ని రోజులయితే అలవాటయిపోతుంది. రెండ్రోజులు అలాగే ఉంటుంది' అనుకున్నారు.

కానీ రోజులు గడుస్తున్నా, మనసు పిల్లలవైపే లాగిందనుకుంటా. ఇద్దరూ కూడ బలుక్కుని, ఉత్తరం రాసారు కొడుక్కి.

'బాబూ....

ఉభయకుశలోపరి అని అలవాటుగా రాస్తాను కానీ మేమెలా ఉన్నామో అని బెంగతో మీరు, మీకు దూరంగా ఒంటరితనంతో మేము సంతోషంగా ఉండలేమనిపించింది. మన బంధాలు మాకన్నా మొండివి. అందుకే. నేనూ మీ అమ్మా, అక్కడికి వచ్చేయడానికే నిర్ణయించుకున్నాము. కలవని మనసులు, మనుషులు ఎలాగూ కలిసి ఉండలేరు. ఇంత అభిమానంతో, ఆప్యాయతతో మీరు ఉండమంటుంటే, మొండిగా వచ్చేసాం. బంధాలు అంత కన్నా మొండివనుకుంటా.

నువ్వు సెలవు పెట్టి వచ్చి ఇక్కడ ఇల్లు అద్దెకివ్వడం, బ్యాంకు వ్యవహారాలు అవీ చూసి మమ్మల్ని తీసికెళ్ళు. కోడల్ని కూడా తీసుకొస్తే సామాన్లు సర్దటం అవీ చూసుకుంటుంది.

కోడలికి పిల్లలకి ఆశీస్సులు.

నీ కోసం ఎదురుచూస్తూ.– మీ నాన్న.'

ఉత్తరం చదవగానే ఎంతో సంతోషమనిపించింది సరళకి. భర్త రాగానే విషయం చెప్పి. భర్తని అడిగింది.

''మావయ్యగారెప్పుడు ఫోన్ చేస్తారు కదా, వచ్చేప్పుడు. ఈసారి ఉత్తరం రాసారేమిటి'' అని.

''ఉత్తరాలే ఎంతో బావుంటాయి సరళా! ఈ ఉత్తరంలో వాక్యాలు. మనం ఎప్పటికీ మరచిపోలేము చూడు.'' అన్నాడు.

*

రచయిత సెల్ నెం: 99489 02602

